## ఇంగ్లండ్ పర్యటనకు కేటీఆర్

- 20, 21వ తేదీల్లో ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం సదస్సుకు..
- పదేండ్ల తెలంగాణ అభివృద్ధిపై కీలకోపన్యాసం



హైదరాబాద్, జూన్ 19 (నమస్తేతెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఇంగ్లండ్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఇంగ్లండ్‌లోని ప్రతిష్ఠాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 20, 21వ తేదీల్లో నిర్వహించనున్న ఫ్రాంటియర్ టెక్నాలజీ ఫర్ డెవలప్‌మెంట్ ఇన్ ఇండియా సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పదేండ్లలో తెలంగాణ అభివృద్ధికి సాంకేతికతను వినియోగించిన తీరు.. పెట్టుబడి ఆకర్షణలకు తీసుకున్న చర్యలు, అమలుచేసిన పారిశ్రామిక విధానాలు అనే అంశంపై కేటీఆర్ కీలకోపన్యాసం చేయనున్నారు.

### • ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ సమ్మె నోటీసు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌కు అర్హత ఆధారంగా కన్వర్షన్ ఇవ్వాలనే డిమాండ్‌తో తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ గురువారం యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసింది. జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యప్రకాశ్, ఎస్పీడీసీఎల్ ముషారఫ్ అలీ ఫారూఖీని కలిసి నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ వజీర్, కోచైర్మన్లు నాగరాజు, నరేందర్, కో కన్వీనర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### • పాలమూరు బయోసైన్సెస్‌పై కేసు నమోదు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): పాలమూరు బయోసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తీవ్రమైన జంతుహింస జరుగుతుందని జంతుహక్కుల సంస్థ 'పెటా' ఫిర్యాదు మేరకు ఆ సంస్థపై భూత్పూర్‌లో కేసు నమోదైనట్టు అధికారులు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కర్వెన ల్యాబొరేటరీలో జంతువుల మందులు, పెస్టిసైడ్స్, వైద్య పరికరాల పనితీరును పరీక్షించడానికి అశాస్త్రీయంగా పరిశోధనలు చేస్తున్నారని 'పెటా ఇండియా' శాస్త్రవేత్త, రీసెర్చ్ పాలసీ అడ్వైజర్ డాక్టర్ అంజనా అగర్వాల్ ఫిర్యాదులో పేర్కొన్నారు. పాలమూరు బయోసైన్సెస్‌లో 800 కుక్కలను ఉంచేందుకు కేటాయించిన స్థలంలో సుమారు 1,500 ఉంచడంతో గాయాలపాలవుతున్నాయని తెలిపారు. వాటిపై మందులను ఇంజెక్ట్ చేయడంతో అవి ఇన్‌ఫెక్షన్‌కు గురవుతున్నట్టు ఆరోపించారు. దీనిపై పోలీసులు పలు సెక్షన్ల కింద నమోదు చేశారు. ఈ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత.. జంతువులపై ప్రయోగాల నియంత్రణ, పర్యవేక్షణ కమిటీ (సీసీఎస్ఈఏ) ప్రాంగణాన్ని తనిఖీ చేయడానికి ఒక అత్యవసర కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో ప్రాంగణాన్ని తనిఖీ చేసిన కమిటీ.. జంతువులను చంపడం, వైకల్యం చేయడం, జంతువులకు కోలుకోలేని నష్టాన్ని కల్గించడం తదితర వాటిపై పలు అభియోగాలు మోపింది. 2021-22 మధ్యకాలంలో రాజస్థాన్ నుంచి కొన్ని జాతులకు చెందిన కుక్కలను తీసుకొచ్చి ప్రయోగాలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యానిమల్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఏపీవో) కూడా బయోసైన్సెస్‌ను శాశ్వతంగా మూసివేయాలని కోరుతూ సీసీఎస్ఈఏకి ఫిర్యాదు చేసింది.

### • నాలుగోసారి సిట్ విచారణకు ప్రభాకర్‌రావు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు గురువారం నాలుగోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. ఉదయం సిట్ కార్యాలయానికి వచ్చిన ఆయనను, సుమారు తొమ్మిది గంటలపాటు విచారించారు. శుక్రవారం కూడా విచారణకు రావాలని సిట్ అధికారులు ప్రభాకర్‌రావును కోరినట్టు తెలిసింది. ఆయన ఇచ్చిన సమాధానాల ఆధారంగా డీజీపీ జితేందర్, మాజీ ఇంటెలిజెన్స్ డీజీ అనిల్‌కుమార్ నుంచి సిట్ పలు సమాధానాలు రాబట్టింది. గురువారం నాటి విచారణలో వారు ఇచ్చిన సమాధానాలతో ప్రభాకర్‌రావును ప్రశ్నించినట్టు తెలిసింది. కాగా, ఈ కేసులో కీలకంగా ఉన్న మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి స్టేట్‌మెంట్ తీసుకునే విషయంలో సిట్ అధికారులు స్పష్టత ఇవ్వలేదు. మహేందర్‌రెడ్డి డీజీపీగా ఉన్న సమయంలోనే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కొనసాగింది.

### • 'పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టాలి'

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టాలని డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు 'తపస్' విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో 'తపస్' రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి సురేశ్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గెజిటెడ్-II హెచ్ఎం పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ తర్వాత రాష్ట్రంలో ఖాళీలు ఏర్పడ్డాయని, వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు బాధ్యత ఆదర్శ పాఠశాల కమిటీకి అప్పజెప్పాలని, తరగతులు పెంచిన చోట కొత్తగా ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని కోరారు.

### • 21, 22వ తేదీల్లో 'టీటీడీ' ఫోన్ల వేలం

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు తిరుపతిలోని ఇతర అనుబంధ ఆలయాల్లో స్వామివారికి భక్తులు కానుకలుగా ఇచ్చిన మొబైల్ ఫోన్లను వేలం వేయనున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. శ్రీవారికి కానుకగా భక్తులు సమర్పించిన 74లాట్ల మొబైల్ ఫోన్లను ఈనెల 21, 22న టీటీడీ తమ అధికారిక వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈ -వేలం వేయనున్నట్టు పేర్కొన్నది. ఈ ఫోన్లను ఖరీదు చేయాలనుకునే ఆసక్తి కల్గిన భక్తులు ఏపీ ప్రభుత్వ ఈ-కొనుగోలు పోర్టల్‌లో రిజిస్టర్ అవ్వాలని టీటీడీ సూచించింది. ఇలా రిజిస్టర్ అయిన వ్యక్తులు బిడ్డర్లు వేలంలో పాల్గొనటానికి అర్హులని, ఈ వేలానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం స్థానిక జనరల్ మేనేజర్ లేదా ఏఈవోలను సంప్రదించాలని కోరింది. లేదా తిరుపతిలో టీటీడీ, హరేకృష్ణమార్గ్, https//konugolu.ap.gov.inap.gov.in లేదా టీటీడీ వెబ్‌సైట్ www.tirumala.org లేదా 0877 - 2264429 నంబర్‌ను సంప్రదించాలని టీటీడీ సూచించింది.

## నేడు, రేపు మోస్తరు వర్షాలు

**రాష్ట్రంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావం**

**వెల్లడించిన హైదరాబాద్ వాతావరణశాఖ కేంద్రం**




హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలో పశ్చిమ, నైరుతి దిశలనుంచి గాలులు వీస్తున్నాయని ఫలితంగా.. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో వెల్లడించింది. గురువారం రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వానలు కురిసినట్టు పేర్కొన్నది. శుక్ర, శనివారాల్లో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్టుగా తెలిపింది. కాగా, గడిచిన 24 గంటల్లో వనపర్తి, మహబూబ్‌నగర్, నిర్మల్, ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో తేలికపాటి వానలు కురిశాయని వివరించింది.

**సీజన్‌లో 7రోజులే వానలు**

నైరుతి రుతుపవనాలు ప్రవేశించి 19రోజులైనప్పటికీ.. ఇప్పటివరకు సగటున 7రోజుల వర్షపాతం మాత్రమే నమోదైనట్టు వాతావరణశాఖ వెల్లడించింది. కేవలం కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 8రోజులు గరిష్ఠంగా వర్షాలు కురిశాయని వాతావరణ శాఖ తెలిపింది. సంగారెడ్డి, వనపర్తిలో 7రోజులు, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, జోగులాంబ గద్వాల, సిద్దిపేట, నిర్మల్, ఆదిలాబాద్, యాదాద్రి-భువనగిరి, మెదక్ జిల్లాల్లో 6రోజుల చొప్పున వర్షపాతం నమోదైందని వెల్లడించింది. మిగతా జిల్లాల్లో ఒకటి నుంచి 4రోజులపాటు వర్షపాతం నమోదైనట్టు వివరించింది.

# డాక్టర్ రవీందర్‌రావుకు తుదివీడ్కోలు

**అంత్యక్రియలకు హాజరైన మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్**



డాక్టర్ రవీందర్‌రావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. (ఇన్‌సెట్‌లో) డాక్టర్ చెన్నాడి రవీందర్‌రావు (ఫైల్)

బోయినపల్లిరూరల్, జూన్ 19 : ప్రముఖ సీనియర్ జనరల్ సర్జన్, ప్రతిమ వైద్యకళాశాల డీఎంఈ చెన్నాడి రవీందర్‌రావు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో మరణించారు. అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామమైన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొరెంలో జరిగాయి. రవీందర్‌రావు అంత్యక్రియలకు ఆయన బావ, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు-వినోద దంపతులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ -మాధవి దంపతులు, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీజేపీ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, ప్రతాప రామకృష్ణ హాజరై నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**కొరెంలో విషాదఛాయలు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తూ అందరి మన్ననలు పొందిన రవీందర్‌రావు మరణంతో కొరెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎన్నో కుటుంబాలకు నేనున్నానని ధైర్యం చెప్పి ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడని గ్రామస్థులు ఆయన సేవలు కొనియాడుతూ కన్నీటిపర్యంతమయ్యారు. రవీందర్‌రావు వైద్యపరంగానే కాకుండా సమాజసేవకు తనవంతు సహాయసహకారాలు, విరాళాలు అందించారని, కొరెంలో నిరుపేదలు ఇల్లు కట్టుకోవడానికి, ప్రజాఅవసరాలకు భూవిరాళం అందజేసి గొప్ప ఔన్నత్యాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు.

## కలకత్తాకు రైళ్లు ఏవీ?

**ఉత్తర తెలంగాణపై కేంద్రం చిన్నచూపు**

**కాజీపేట నుంచి బల్లార్షా దాకా ఒక్కరైలు లేదు**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పరిశ్రమల్లో వందలాది మంది బెంగాల్‌వాసులు**

**దూరాభారంతో వస్త్రవ్యాపారులు, కూలీలకు తిప్పలు**

పెద్దపల్లి, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఉత్తర తెలంగాణలోని అత్యధిక జిల్లాల్లో విస్తరించి ఉన్న రైల్వేస్టేషన్ల నుంచి కలకత్తాకు రైళ్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తర తెలంగాణలోని సగానికంటే ఎక్కువ ప్రాంతం కలిగిన కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి ఒక్కటంటే ఒక్క రైలు కూడా లేకపోవడంతో ఇక్కడి పరిశ్రమలు, ఇటుక బట్టీల్లో పనిచేసే బెంగాల్ వాసులు నరకం చూస్తున్నారు. ప్రస్తుతం కాజీపేట నుంచి బల్లార్షా మార్గంలో ఒక్కటంటే ఒక్క రైలు కల్‌కత్తా మహానగరానికి లేదు. ఈ మార్గంలో కల్‌కత్తాకు ప్రతిరోజు రైలు నడపాలనే డిమాండ్ ఏండ్లుగా ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సిర్పూర్-కాగజ్‌నగర్ ప్రాంతంలో అనేక మంది బెంగాలీలు 20 ఏండ్లుగా స్థిరపడ్డారు. పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్ ప్రాంతంలో అత్యధికంగానే ఉన్నారు. వీరికోసం ఈ మార్గంలో రోజూ కలకత్తాకు రైలు నడపాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నది. చర్లపల్లి లేదా సికింద్రాబాద్ నుంచి సంత్రాగచ్చికి ప్రతి రోజు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను వయా కాజీపేట-పెద్దపల్లి- మంచిర్యాల-సిర్పూర్ కాగజ్‌నగర్- బల్లార్షా- నగ్భిడ్-గోండియా-రాయ్ పూర్-బిలాస్‌పూర్- ఝార్సుగూడ- రూర్కేల- టాటా నగర్- ఖరగ్‌పూర్ మీదుగా నడిపితే ఎంతో ప్రయోజనం ఉంటుందని బెంగాలీలు కోరుతున్నారు.

## చైల్డ్‌పోర్న్ చూసిన 15మంది అరెస్ట్

- చిన్నపిల్లల అశ్లీల వీడియోలు చూసిన వారిపై చర్యలు
- డౌన్‌లోడ్, ఫార్వార్డ్ చేసిన వారిపైనా సీఎస్‌బీ కొరడా
- 220 సైట్స్‌ను బ్లాక్ చేశాం: సీఎస్‌బీ డీజీ శిఖాగోయెల్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్‌లో చిన్న పిల్లల అశ్లీల వీడియోలు చూడటం, డౌన్‌లోడ్, స్టోరేజ్, ఫార్వార్డ్ చేస్తున్న 15 మందిని అరెస్టు చేసినట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) డీజీ శిఖాగోయెల్ తెలిపారు. నిందితులంతా పదేపదే ఆ వీడియోలు చూస్తూ, ప్రభావితమవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ మేరకు తెలంగాణ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆమె మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 18న హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, జగిత్యాల, యాదాద్రి, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు. దేశంలో సైబర్ టిప్‌లైన్‌లు, చిన్నపిల్లల అశ్లీల దృశ్యాలు వీక్షించే వారికి సంబంధించి ఫిర్యాదులను సమన్వయం చేయడానికి సీఎస్‌బీ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తున్నదని వివరించారు. ఫిబ్రవరిలో సీఎస్‌బీకి అనుబంధంగా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (సీపీయూ) ఏర్పాటు చేశామని, నాలుగు నెలల్లోనే 294 కేసులు నమోదు చేసి, 110 మందిని అరెస్టు చేసినట్టు చెప్పారు. ఇలాంటి కేసులలో అరెస్టయిన వారిపై ఐటీ చట్టం సెక్షన్ 67-బీ, పోక్సో చట్టం సెక్షన్ 15 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్పారు. ఈ క్రమంలో సుమారు 220 వెబ్‌సైట్స్, యాప్స్‌ను బ్లాక్ చేశామని వెల్లడించారు. సమావేశంలో సీఎస్‌బీ ఎస్పీ హర్షవర్ధన్, డీఎస్పీలు కేవీఎం ప్రసాద్, భిక్షంరెడ్డి, వాసు, వెంకటేశ్వర్‌రావు, హరికృష్ణ, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

**'చైల్డ్‌పోర్న్' గురించి వెతికినా నేరమే**

ఇంటర్‌నెట్, యాప్స్, ఆన్‌లైన్ వేదికలపై చిన్నపిల్లల అశ్లీల దృశ్యాల గురించి వెతికినా కూడా నేరంగానే పరిగణిస్తాం. ఈ తరహా అంశాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. చైల్డ్‌పోర్న్ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసినా, షేర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. పోర్న్ వీడియోలు పోస్టు చేస్తున్న సోషల్‌మీడియా వేదికల యజమానులకు కూడా సూచనలు చేశాం. ఈ విషయాలపై అవగాహన కలిగిన వారు ఇతరులకు అవగాహన కల్పించాలి. డిజిటల్ స్పేస్‌లో పిల్లల భద్రత కోసం అండగా ఉంటాం. ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి చట్టపరంగా శిక్ష తప్పదనే బలమైన సందేశాన్ని పంపించడమే ఈ ఆపరేషన్ ముఖ్య లక్ష్యం.

**-శిఖా గోయెల్, టీఎస్‌సీఎస్‌బీ డీజీ**

## ఆరోగ్య సమస్యలతో కార్మికుల్లో కలవరం

**మానసిక ఒత్తిడి, ఆర్థిక సమస్యలే ప్రధాన కారణం**

**ప్రతి 1000 మందిలో 458 మందికి పలు వ్యాధులు**

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ కర్మాగారాలు, పలు పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు కలవరపెడుతున్నాయి. ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేయడం, అక్కడి వాతావరణం, పెరుగుతున్న మానసిక ఒత్తిడి, ఆర్థికపరమైన ఇబ్బందులతో వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నట్టు ఇటీవల కార్మికరాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) వార్షిక నివేదికలో గణాంకాలతో సహా వెల్లడించింది. అనారోగ్య లక్షణాలు కనిపించినప్పటికీ.. ఉద్యోగ భద్రత లేకపోవడం, కుటుంబ పోషణభారంగా మారుతుందనే కారణంతో సరైన వైద్యం తీసుకోకపోవడంతో వ్యాధులు ముదిరి ప్రాణాలు కోల్పోతున్నట్టు నివేదికలో వివరించింది. 2024లో ఈఎస్ఐసీ పరిధిలోని దవాఖానలు, డిస్పెన్సరీల్లో ప్రతి 1000 మంది కార్మికులకుగాను 458 మంది ఏదో ఒక వ్యాధితో చికిత్స తీసుకుంటున్నట్టు పేర్కొన్నది.

**ఒక్కో కార్మికుడిపై వైద్యానికి రూ.3 వేల ఖర్చు**

రాష్ట్రంలో బీమా సేవల పరిధిలో 15.53 లక్షల మంది కార్మికులు ఉన్నట్టు ఈఎస్ఐసీ వెల్లడించింది. వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 72.69 లక్షల మంది వైద్యసేవలు పొందేందుకు అర్హులని పేర్కొన్నది. సగటున ఏటా ఒక్కో కార్మికుడిపై రూ.4,108 ఖర్చు చేసినట్టు తెలిపింది. 2024లో దవాఖానల్లో పలు కారణాలతో 5.5లక్షల మంది కార్మికులు చేరారని స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా ఏటా ఒక్కో కార్మికుడిపై వైద్యం కోసం సగటున రూ.3వేలు ఖర్చు చేస్తున్నదని వివరించింది.





